క్లుప్తంగా

వర్క్‌షాప్ పోస్టర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీఐఐటీ–ఐపీఆర్ చైర్, సెంటర్ ఫర్ ఇంట లెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, ఆ–హబ్ సంయుక్తంగా ఈ నెల 29న నిర్వహించనున్న ఒకరోజు వర్క్‌షాప్–ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పోస్టర్‌ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో శుక్రవారం విడుదల చేశారు. ఏయూ పూర్వవిద్యార్థుల సంఘం సమావేశ మందిరంలో ఈ వర్క్‌షాపు జరగనుంది. స్టార్టప్ నిర్వాహకులు, పరిశోధకులు, ఆచార్యుల్లో మేథో హక్కుల ప్రాధాన్యత తెలియజేసేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ: విద్యుత్ విభాగం అధికారులు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన 11 కేవీ ఇందిరానగర్ ఫీడర్ నిర్వహణ పనులు చేపట్టనున్నందున శనివారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

భక్త చైతన్య యాత్ర బృందానికి అభినందన సభ రేపు

ఏయూక్యాంపస్: తెలుగు రాష్ట్రాల్లో ఉన్న దేవాలయాలను సందర్శిస్తూ నిర్వాహణకు పలు సూచనలు సలహాలు అందిస్తూ భక్త చైతన్య యాత్ర చేస్తున్న బృందానికి ఆదివారం సాయంత్రం ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల వైఎస్ మూర్తి ఆడిటోరియంలో అభినందన సభ నిర్వహించనున్నామని విశాఖ సమాచారం ప్రధాన సంపాదకుడు ఎస్.వీరభద్రరావు, పతంజలి యోగా కేంద్ర వ్యవస్థాపకుడు జి.వేదభాస్కర్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సభలో ప్రముఖ సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు కీలక ఉపన్యాసం చేస్తారన్నారు.

పాపాహోం చిన్నారులు గొప్పగా రాణించాలి



ఆకట్టుకున్న పాపాహోం విద్యార్థుల ప్రదర్శన

అల్లిపురం : దాతల సహకారంతో నడుస్తున్న పాపాహోంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులు చక్కగా చదువుకుని ఉత్తములుగా రాణించాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ఆకాంక్షించారు. సూర్యాబాగ్ దరి, పోలీస్ బ్యారెక్స్‌లో గల పాపాహోం 24వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హోంను క్రమశిక్షణతో నిర్వహిస్తున్న సిబ్బందిని సీపీ అభినందించారు. డాక్టర్ ఎ.సుమిత శంకర్, డాక్టర్ అస్లాం ఆరిఫ్, పాపాహోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



విశాఖ కేంద్ర కారాగారంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్



విమ్స్‌లో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ డాక్టర్ రాంబాబు



మాట్లాడుతున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ డైరెక్టర్ శాలివాహన్



మద్దిలపాలెం బాబా రీడింగ్ రూంలో గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ గుడ్ల విజయసాయి

మురిసిన మువ్వన్నెల జెండా



విశాఖ వ్యాలీ స్కూల్‌లో కవాతు నిర్వహిస్తున్న విద్యార్థులు



దేశభక్తి గీతాలకు శ్రీసత్యసాయి విద్యార్థుల ప్రదర్శన



లెబెన్‌హిల్ఫేలో జెండా ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ లక్ష్మి



జెండా వందనం చేస్తున్న ఇగ్నో డైరెక్టర్ గోనిపాటి ధర్మారావు, తదితరులు

వాడవాడలా ఘనంగా గణతంత్ర వేడుకలు



వెంకోజీపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న హెచ్ఎం జ్యోతి

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో గణతంత్ర వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థల కార్యాలయాల వద్ద మువ్వన్నెల జెండా రెపరెపలాడింది.

- విశాఖ కేంద్ర కారాగారంలో జైలు పర్యవేక్షణాధికారి కిశోర్‌కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్లు రామచంద్రరావు, కమలాకర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో సిబ్బంది చేసిన కవాతు ఆకట్టుకొంది. అనంతరం జైలు పర్యవేక్షణాధికారి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ జైల్‌లో 2023లో ఉత్తమ సేవలు అందించిన ముగ్గురు సిబ్బంది అవార్డులకు ఎంపికయ్యారన్నారు.
- విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం సిబ్బందికి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో విమ్స్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.
- విశాఖ వ్యాలీ స్కూల్‌లో గణతంత్ర వేడుకల్లో భాగంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇక్కడ విద్యార్థులు కవాతుతో ఆకట్టుకున్నారు.
- ప్రభుత్వ ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ, రూరల్ తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రమణయ్య, ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో సీఐ సోమశేఖర్, పెదగదిలి ప్రాథమిక పాఠశాలలో 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి జాతీయ జెండా ఆవిష్కరించారు.

ఇంధన రంగంలో ఆశాదీపంగా ఐఐపీఈ

ఏయూ క్యాంపస్: ఇంధన రంగంలో ఆశాదీపంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ నిలుస్తుందని సంస్థ డైరెక్టర్ ఆచార్య శాలివాహన్ అన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేసారు. అనంతరం మాట్లాడుతూ విశాఖను హైడ్రోజన్ సిటీగా తీర్చిదిద్దడంలో ఐఐపీఈ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రామ్ పాల్ ద్వివేదీ, ఆచార్య కె.విజయకుమార్, ఆచార్య సి.వి.రావు, రవికుమార్ సోన్వానీ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎంవీపీ కాలనీలోని పలు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు కళాశాలలు, పాఠశాలల్లో జాతీయ జెండా ఆవిష్కరణలు ఘనంగా జరిగాయి. అప్పుఘర్‌లోని లెబన్‌హిల్ఫే మానసిక వికలాంగుల పాఠశాలలో డైరెక్టర్ లక్ష్మీసూర్యశ్రీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. – ఇగ్నో ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు జెండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రాజారావు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

- ఎంవీపీ కాలనీ సెక్టార్–8లోని సత్యసాయి స్కూల్‌లో బ్రిగేడియర్ సత్య, పాఠశాల ప్రిన్సిపాల్ కౌసల్య జెండా ఆవిష్కరణ చేశారు. సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.
- జీవీఎంసీ 19వ వార్డు వాసవానిపాలెంలో జీవీఎంసీ మత్స్యకార పాఠశాలలో లయన్స్ క్లబ్ ద్వారకానగర్ అధ్యక్షుడు పేర్ల భాస్కరరావు, పాఠశాల హెచ్ఎం సత్యవేణి, తదితరులు జెండా ఎగుర వేశారు.
- విశాఖపట్నం పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ సెక్టార్–6 రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కులో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో సంఘం అధ్యక్షుడు పరుశురాం, కమిటీ ప్రతినిధులు రాము, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెం బాబా రీడింగ్ రూమ్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఎంపీ, వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్లు గుడ్ల విజయసాయి, సాడి పద్మారాణి, వార్డు నాయకుడు గుడ్ల సత్యారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్ని జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో జేసీఏ శ్రీనివాస రెడ్డి, రామకృష్ణారెడ్డి, బాబా రీడింగ్ రూమ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వందన సమర్పణ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.సుజాత జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులు చేసిన సాహస ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి దుర్గాప్రసాద్, కళాశాల ఎన్‌సీసీ అధికారి సన్యాసినాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.
- వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం సిహెచ్.జ్యోతి జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు.
- జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో ఎంపీ, వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నైపుణ్యాలతో కూడిన మానవ వనరుల అవసరం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తూ

ఏయూక్యాంపస్: నైపుణ్యాలు కలిగిన యువతతో ఆధునిక భారతావని ఆవిష్కరించడం కోసం ఆంధ్ర విశ్వవిద్యాలయం పని చేస్తోందని వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం ఏయూ బాస్కెట్ బాల్ మైదానంలో 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ ఏయూలో అభివృద్ధి చేసిన నూతన మౌలిక వసతులు ఇండస్ట్రీ 4.0 దిశగా యువతను నడిపిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో వర్సిటీలో 500 ఆచార్యుల నియామకాలు జరుపుతామన్నారు. 98 సంవత్సరాల విశ్వవిద్యాలయ ప్రయాణంలో నాక్ ఏ డబుల్ ప్లస్ అక్రిడియేషన్ సాధించిందన్నారు. ముందుగా ఏయూలోని మహాత్మాగాంధీ, డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతనం ఎన్‌సీసీ, దేశ రక్షణ దళాల సిబ్బంది, ఏయూ సెక్యూరిటీ, ఏయూ క్రీడా విభాగం విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఉద్యోగులకు, విద్యార్థులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత ప్రమాణాలతో విద్యుత్ సరఫరా



ఏపీఈపీడీసీఎల్ కార్పొరేటర్ కార్యాలయంలో బెలూన్లు ఎగురువేస్తున్న సీఎండీ పృథ్వీతేజ్

సీతమ్మధార: ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. 11 జిల్లాల్లోని సుమారు 70 లక్షల వినియోగదారులకు అత్యున్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. 2,924 గిరిజన ఆవాసాల్లో సుమారు18,620 ఇళ్లకు ఫిబ్రవరి నాటికి ఉచిత విద్యుత్ సదుపాయం కల్పిస్తామన్నారు. 94 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, ఏవీవీ సూర్యప్రతాప్, చంద్రం, సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఏవీఎల్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్ దూకుడు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్స్‌లో జరిగిన వేడుకల్లో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆర్పీఎఫ్, సివిల్ డిఫెన్స్ సభ్యులు, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నుంచి గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. వాల్తేర్ డివిజన్ ఉద్యోగులు, సిబ్బంది అంకితభావం, నిరంతర కృషి, సానుకూల ధోరణుల వల్ల దేశంలో ఇతర డివిజన్ల కంటే అభివృద్ధిలో దూసుకుపోతున్నట్లు చెప్పారు. ఏప్రిల్–డిసెంబరు 23 నాటికి సరకు రవాణాలో వాల్తేర్ డివిజన్ టాప్–5లో నిలిచిందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), సుధీర్‌కుమార్ గుప్తా(ఇన్‌ఫ్రా) తదితరులు పాల్గొన్నారు.

80 మెట్రిక్ టన్నుల సరకు రవాణా లక్ష్యం



గౌరవ వందనం స్వీకరిస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

సీతంపేట: విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 80 మెట్రిక్ టన్నుల సరకు రవాణాకు చేరుకుంటున్నట్లు చెప్పారు. 2027 నాటికి 100 మెట్రిక్ టన్నుల సరకు రవాణా చేస్తామని తెలిపారు. పోర్టు అథారిటీ.. ఎన్‌హెచ్ఏఐ, రైల్వేస్‌తో కలిసి మౌలిక వసతుల అభివృద్ధికి రూ.300 కోట్లకు పైగా వెచ్చిస్తోందన్నారు. ముందుగా సీఐఎస్ఎఫ్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. సీఐఎస్ఎఫ్ డాగ్‌షో, యుద్ధరీతులు ఆకట్టుకున్నాయి. ఉద్యోగులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు.

వీఎంఆర్డీఏ కార్యాలయంలో జెండా వందనం



వీఎంఆర్డీఏ కార్యాలయంలో కలెక్టర్, మెట్రోపాలిటన్ కమిషనర్ డాక్టర్ మల్లికార్జున జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర, సెక్రటరీ డి.కీర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



అనకాపల్లి కలెక్టర్ రవి పటాన్‌శెట్టి నుంచి అవార్డు అందుకుంటున్న భాస్కర్



జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ నుంచి అవార్డు అందుకుంటున్న మురళి

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీకి చెందిన ఇద్దరు ఉద్యోగులకు ఉత్తమ సేవా అవార్డులు లభించాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎంవీపీ కాలనీలోని సెక్టార్–9 డీఆర్‌డీఏలోని ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగి భాస్కర్, 17వ వార్డులో రెడ్‌క్రాస్ హోం మేనేజర్ మురళీ అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పటాన్‌శెట్టి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ నుంచి అవార్డులు అందుకున్నారు. విశాఖ కేంద్రంగా అనకాపల్లి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు, జిల్లా అధికార యంత్రాంగానికి అందిస్తున్న విలువైన సేవలకు భాస్కర్ ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సహ ఉద్యోగులు వారికి అభినందనలు తెలిపారు.

ఒక మంచి మాట ఏయూకు పెద్ద సంపద



నూతన కార్యవర్గంతో ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గురించి విశాఖ ప్రజలు చెప్పే ఒక మంచి మాట వర్సిటీకి పెద్ద సంపదగా నిలుస్తుందని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం వీఎంఆర్‌డీఏ పార్కులో సీషోర్ వాకర్స్ అసోసియేషన్ నిర్వహించిన నూతన కార్యవర్గ పదవీ స్వీకారం, గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి సభ్యులతో మాట్లాడారు. ముందుగా నూతన కార్యవర్గాన్ని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ మన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించడం ఎంతో ప్రధానమన్నారు. ఏయూలో స్థాపించిన ఆ హబ్‌లో నేడు 152 సంస్థలు పనిచేస్తున్నాయన్నారు. ఏయూలో మైదానాలను అభివృద్ధి చేసి యువతకు ఉపయుక్తంగా నిలిపామన్నారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరుపుతామని, ఏయూ ప్రగతిని మీరంతా స్వాగతించాలని, స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి జి.తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు ఎల్.కృష్ణ, ఐఎల్.నరసరావు, కోశాధికారి ఎం.ఎస్.నాయుడు, సంయుక్త కార్యదర్శులు ఎ.జానకీరామ్, కె.విజయానంద్, డిస్ట్రిక్ట్ గవర్నర్–101 టి.రంగారావు, సీనియర్ సభ్యులు డాక్టర్ పెదసోములు, క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్' ఆకట్టుకుంటుంది



మాట్లాడుతున్న హీరో సుహాస్, హీరోయిన్ శివాని

బీచ్ రోడ్డు: ప్రేమ, భావోద్వేగాలతో కూడిన అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్రం హీరో సుహాస్ తెలిపారు. శుక్రవారం చిత్రం యూనిట్ నగరంలో సందడి చేసింది. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ చిత్రం టీజర్, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. ఇద్దరు కవలలు పుట్టిన రోజు నాడు జరిగిన సంఘటనలతో సినిమా కథ, కథనం సాగుతుందన్నారు. హీరోయిన్ శివాని మాట్లాడుతూ ఈ చిత్రంలో వినోదం, ఎమోషన్ సన్నివేశాలు ఎంజాయ్ చేస్తూ నటించానన్నారు. ఇందులో తన పాత్ర చాలా ఆసక్తికరంగా ఉంటుందన్నారు. తనకు తొలి చిత్రం అయినప్పటికీ షూటింగ్ సమయంలో దర్శకుడు దుశ్యంత్, నిర్మాతలు బన్నీ వాసు, ధీరజ్ మంచి సహకారం అందించారన్నారు.

ఘనంగా రాచపోలమాంబ పరస



అల్లిపురం : జీవీఎంసీ పరిధి 32వ వార్డులో వెలసిన శ్రీ రాచపోలమాంబ అమ్మవారి పరస శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు నేరెళ్లకోనేరు, ఏడుగుళ్ల స్లమ్, మార్కెట్‌రోడ్డు, బంగారమ్మమెట్ట, కర్ణాలవీధి, పీలావారి వీధి, చలువతోట, అల్లిపురం మెయిన్‌రోడ్డు, కుమ్మరవీధి, దేవాంగుల వీధి తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.